కంది, వేరుశనగ ఉత్పత్తులకు బీట్లు

ధారూరు, ఫిబ్రవరి 17: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కంది, వేరుశనగ ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కందులు గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ. 10,300, కనిష్ఠంగా రూ. 10,100, వేరుశనగకు గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.7వేలు, కనిష్ఠంగా రూ.6,400లకు క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్ధమ్మ తెలిపారు. కాగా కందులు 112 క్వింటాళ్లు, వేరుశనగ 307.8 క్వింటాళ్ల విక్రయాలు జరిగాయని చెప్పారు.



అభివృద్ధి పనుల గురించి తెలుసుకుంటున్న దానకిషోర్

మహిళా సాధికారతే ధ్యేయం

ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్

కొడంగల్, ఫిబ్రవరి 17: మహిళా సాధికారతకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కొడంగల్ నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించేందుకు వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మయంక్ మిట్టల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలతో కలిసి పవర్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. అంతకు ముందు స్వయం సహాయక సంఘాల సభ్యుల పనితీరు, కుటుంబాల నేపథ్యం, స్థితిగతులు, పిల్లల చదువులు తదితర అంశాలపై మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధికి ఉపయోగపడేలా నైపుణ్య అభివృద్ధి యూనివర్సిటీలను స్థాపించేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. మహిళలు మరింత అభివృద్ధి చెందేలా చేపట్టాల్సిన పనులపై సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. ఉన్నత చదువులు చదివి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరి కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం కొడంగల్ మున్సిపాలిటీలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, స్థలాల పరిశీలన, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్

అట్టహాసంగా మలిపెద్ది సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 17: మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఘట్‌కేసర్ మండలం, ప్రతాప్‌సింగారంలోని సుధీర్‌రెడ్డి నివాసానికి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, భారీసంఖ్యలో చేరుకుని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సుధీర్‌రెడ్డి తనయుడు జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్దన్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, కందుల కుమార్, మాజీ సర్పంచులు సుధీర్‌రెడ్డితో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వజ్రేష్‌యాదవ్, హరివర్దన్‌రెడ్డి

- నిబంధనలు గాలికి.. ఇంటర్ కాలేజీల ఇష్టారాజ్యం
- పది పరీక్షలకు నెలల ముందే అడ్మిషన్ ప్రక్రియ
- పీఆర్వోలతో తల్లిదండ్రులకు ఫోన్లు
- పట్టించుకోని ఇంటర్ బోర్డు అధికారులు

ఎప్పటిలాగానే ఈ సారీ ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ ఫీజుల దందాకు తెరలేపాయి. ఇంకా పదో తరగతి వార్షిక పరీక్షలు అవనే లేదు. ఇప్పటికే అడ్మిషన్ ప్రక్రియ మొదలు పెట్టాయి. పెద్దపెద్ద ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, పాంప్లెట్లతో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఇంటర్ బోర్డు అకాడమిక్ అడ్మిషన్ తేదీలను వెలువరించకుండా ముందస్తుగా అడ్మిషన్లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం. ఇదిలా ఉంటే ఏటా ఫీజులు కూడా వేలల్లో పెంచుతున్నారు. ఇప్పుడే అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామంటూ కాలేజీల నిర్వాహకులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రభుత్వం చర్యలేమీ తీసుకోవడం లేదు.



ఏప్రిల్/మే నెలల్లో ఇంటర్ అడ్మిషన్ నోటిఫికేషన్

వాస్తవానికి పదో తరగతి పరీక్షలు ముగిసి, ఫలితాలు వెల్లడించిన తర్వాతే ఇంటర్‌బోర్డు ఫస్టియర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను జారీ చేస్తుంది. ఇది ప్రభుత్వ కాలేజీలతో పాటు ప్రైవేట్ కాలేజీలకు సైతం వర్తిస్తుంది. అప్పుడే ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోవాలి. యేటా ఏప్రిల్ లేదా మే నెలలో నోటిఫికేషన్ వస్తుంది. కానీ కార్పొరేట్ కాలేజీలు ముందుగానే అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నాయి. అడ్వాన్స్ బుకింగ్ పేరిట భారీగా వసూళ్లు చేస్తున్నారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమైనా.. ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ లోపం.. ప్రభుత్వం కాలేజీలను అదుపుచేసే పరిస్థితి లేకపోవడంతో ఇలా జరుగుతోందని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి

అక్రమాలకు ఆన్‌లైన్‌తోనే చెక్!

రాష్ట్రంలో ఇంటర్ కార్పొరేట్ కాలేజీలు సాగిస్తున్న ఈ అక్రమ దందాకు ఆన్‌లైన్ ప్రవేశ ప్రక్రియ ఒక్కటే పరిష్కారం అని విద్యావేత్తలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఆన్‌లైన్ విధానంతోనే ఫీజుల దందాకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు. ఇప్పటికే 'దోస్త్' ద్వారా డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు విజయవంతంగా చేపడుతున్నారు. ఎంసెట్ సహా అనేక వృత్తి విద్యా కోర్సుల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. ఇంటర్ లోనూ ఇదే తరహా అడ్మిషన్ల విధానాన్ని చేపడితే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

కార్పొరేట్ మాయ!

పరీక్షలకు ముందే కాలేజీల్లో అడ్మిషన్లు

వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇంటర్మీడియట్ ప్రవేశాల్లో కార్పొరెట్ కాలేజీల మాయ మొదలైంది. ఇంకా పదో తరగతి పరీక్షలు పూర్తి కాకముందే పలు కాలేజీల్లో ఇప్పటికే 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు 90శాతం పూర్తవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీలు.. సీట్లు అయిపోతున్నాయంటూ కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నాయి. అడ్వాన్స్‌డ్ బుకింగ్ పేరుతో సీట్లను బ్లాక్ చేస్తున్నాయి. ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ ఏడాది ఇంకా పదో తరగతి పరీక్షలు పూర్తికాక ముందే, ఇంటర్ విద్యకు వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడకముందే కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. రాయితీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వలవేస్తూ ముందస్తు 'సీట్ల' దందాకు తెరలేపాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కొన్ని ఇంటర్ కాలేజీలు జనవరిలోనే అడ్మిషన్లు ప్రారంభించాయి. వివిధ ప్రసార మాధ్యమాలు, పోస్టర్లు, పాంప్లెట్లతో ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కాకమందే ప్రైవేట్ కాలేజీల్లో 2024-25 అకడమిక్ ఇయర్‌కు ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించాయి. ఆయా కాలేజీల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ల(పీఆర్వో)లతో రోజూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తున్నారు. మీరు ముందుగా అడ్మిషన్లు తీసుకుంటే ఫీజు రాయితీ ఇస్తామని, పదో తరగతి ఫలితాల తర్వాత ఈ రాయితీ ఉండదంటూ చెబుతున్నారు. తర్వాత సీట్లు ఉండవని, ఇప్పుడు బుక్ చేసుకోకుంటే ఫీజు తగ్గించడం కుదరదని కాలేజీల యాజమాన్యాలు డిమాండ్‌ను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బైపీసీ(నీట్)కి సీట్లు ఇప్పటికే నిండిపోయాయి. అడ్వాన్స్‌డ్ బుకింగ్ పేరిట తల్లిదండ్రుల నుంచి రూ.5వేల నుంచి 10వేల వరకు కార్పొరేట్ కాలేజీలు వసూలు చేస్తున్నాయి. మంచి కాలేజీల్లో సీట్లు దొరకవేమోనన్న భయంతో తల్లిదండ్రులు కాలేజీలు చెప్పినంత చెల్లించి వారి పిల్లలకు సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. ఈ దందాను అరికట్టాలని ఇంటర్‌బోర్డు అధికారులను విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు ఇలా..

ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈనెలలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. పది పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగనున్నాయి.

ఇంటర్మీడియట్ అధికారులు పట్టించుకోవడం లేదు



పదో తరగతి పరీక్షలు జరగకముందే కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఫస్టియర్‌లో అడ్మిషన్లు ప్రారంభించారు. ఇలా ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు తీసుకుంటున్నా ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి మరీ 'మా కాలేజీలో చేర్పించండి.' అని కాలేజీల నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారు. నిబంధనలు పాటించని కార్పొరేట్/ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ కళాశాలల ఆగడాలను అదుపు చేయడంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు విఫలమయ్యారు. ఏటా 10-20 శాతం ఫీజులు పెంచుతున్నారు. బుక్స్ పేరిట దందా కొనసాగిస్తున్నారు. అడ్మిషన్ సమయంలో డిపాజిట్ పేరిట వసూలు చేస్తున్న డబ్బులు విద్యార్థులకు తిరిగి ఇవ్వడం లేదు.

- శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నాకు రోజూ ఫోన్లు వస్తున్నాయి



నా కూతురు పదో తరగతి చదువుతోంది. ఇంకా పరీక్షలే కాలేదు. కానీ ప్రైవేట్ కాలేజీల నుంచి అడ్మిషన్ల కోసం ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. 'ఇప్పుడే బుక్ చేసుకుంటే ఫీజులో 10-15శాతం కన్సెషన్ ఇస్తాం. ఇప్పుడు బుక్ చేసుకోకుంటే తర్వాత మొత్తం ఫీజు చెల్లించాలి.' అని చెబుతున్నారు. కార్పొరేట్ కాలేజీలు ఇలా అడ్మిషన్ల దందా చేస్తున్నా.. ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారం ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.యాదయ్య, కొందుర్గు

కార్పొరేట్ కాలేజీల్లో ఫీజులను నియంత్రించాలి



ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో ఫీజులను నియంత్రించాలి. ఏటా వేలల్లో ఫీజు పెంచుతున్నారు. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో నాణ్యమైన విద్య అందించకపోవడతోనే వారి పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్‌లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో బాగా చదువు చెబితే ప్రైవేట్‌కు వెళ్లాల్సిన పనే లేదు. దీన్ని ఆసరాగా చేసుకొనే కార్పొరేట్ కాలేజీలు ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నాయి.


- రమేష్, పద్మారం, చౌదరిగూడ మండలం

సాల్విడ్ గుట్టలో చిరుత సంచారం?

కులకచర్ల, ఫిబ్రవరి 17: సాల్విడ్ గ్రామ పరిధిలోని గుట్టలో చిరుత సంచరిస్తుందన్న నేపథ్యంలో అటవీ అధికారులు ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి రాగా దొంగలై ఉంటారని స్థానికులు భావించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వారి కోసం గాలింపు చేపట్టారు. గ్రామ సమీపంలోని గుట్టపై గుహలో దాగి ఉంటారని భావించి చూసేందుకు వెళ్లగా చిరుత ఉన్నట్లు గమనించి భయంతో గ్రామస్తులు పరుగులు తీశారు. తమను చూసి చిరుత గుండ్ల మధ్యనుంచి కిందకు దూకిందని గ్రామానికి చెందిన దాసరి చెన్నయ్య, సున్నల రాములు తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ మురళీధర్‌కు తెలపగా ఆయన అటవీ అధికారులకు సమాచామిచ్చారు. అటవీశాఖ బీట్ అధికారులు సాయికుమార్, జర్పద్దీన్ గుట్ట వద్దకు చేరుని గుహను పరిశీలించారు. ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. కొద్ది దూరంలో మరో గుండుపై కుక్కపిల్ల తల పడి ఉండటాన్ని గమనించారు. అక్కడ సంచరిస్తున్న జంతువును గుర్తించేందుకు ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేశారు. అక్కడ సంచరిస్తున్నది చిరుతనా లేక మరేదైన జంతువా అనేది ట్రాప్ కెమెరాలో రికార్డు అవుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పశువులను ఇంటివద్దే కట్టేసుకోవాలన్నారు.



కెమెరాను ఏర్పాటు చేస్తున్న అధికారులు



కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం

మహర్దశ!

కొడంగల్‌కు నిధుల మంజూరులో సీఎం పెద్దపీట

- కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి నిధుల మంజూరు
- మెడికల్, నర్సింగ్ కళాశాలల నిర్మాణానికి రూ.224.50 కోట్లు
- రైల్వేలైన్ సర్వే పనులకు నిధుల కేటాయింపు
- త్వరలో వీటన్నింటికీ శంకుస్థాపనలు చేయనున్న సీఎం

కొడంగల్, ఫిబ్రవరి 17: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో విసిరేసినట్లుగా.. అన్నీ రంగాల్లో వెనకబడిపోయిన కొడంగల్ ప్రాంతం ఇక అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది. పెండింగ్‌లో ఉన్న జీవోల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. నిధుల మంజూరులో ఈ ప్రాంతానికి పెద్దపీట వేస్తున్నారు. ఇందులో భాగంగా కొడంగల్‌లో మెడికల్, నర్సింగ్, సూపర్‌స్పెషాలిటీ, ఫిజియోథెరపీ కళాశాలలు, కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులను మంజూరు చేశారు. వీటితో పాటు జీవోనెం.69 ద్వారా కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేస్తూ అనుమతులు ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్ సర్వే పనుల కోసం నిధులు కేటాయించడం జరిగింది. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు మరెన్నో అభివృద్ధి పనులకు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో ద్వారా నిధులు మంజూరుతో అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు. మంజూరైన పనులకు పరిపాలనా అనుమతులు, నిధుల విడుదలతో కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే శంకుస్థాపనలు చేయనున్నారు. దీంతో కొడంగల్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకెళ్లేందుకు సీఎం సంబంధిత అధికారులతో నివేదికలు సిద్ధం చేయిస్తున్నారు.

త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటన

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భాగంగా త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 5న పర్యటన ఖరారైనా అనివార్య కారణాలతో వాయిదా పడిన విషయం విదితమే. తిరిగి ఈనెల 20 లేదా 21న కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని తెలుస్తుంది. సీఎం హోదాలో మొదటి సారి కొడంగల్‌కు వస్తున్న రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు అధికారులు సమయత్తం అవుతున్నారు.

కొడంగల్ నియోజకవర్గానికి నిధుల వరద

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి నిధుల వరదతో అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటి వరకు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం, వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్ తదితర వాటికి పరిపాలనా అనుమతులతో ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కళాశాలకు రూ.124.50 కోట్లు, నర్సింగ్ కళాశాలకు రూ.46కోట్లు, ఫిజియోథెరపీ పారా మెడికల్ కళాశాలకు రూ.27 కోట్లు, మెడికల్ ఎడ్యూకేషన్ పరిధిలోకి సీహెచ్‌సీని తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 50 పడకల ఆసుపత్రిని 220 పడకలుగా అప్‌గ్రేడ్‌తో పాటు టీచింగ్ ఆస్పత్రిగా స్థాయి పెంపొందించేందుకు రూ.27 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు రూ.7.13 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో పాటు జీవో నెం.69 ద్వారా కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా సర్వే, ఇన్వెస్టిగేషన్ పనుల కోసం రూ.2.945 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.213 కోట్లు, వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్ సర్వే పనులకు రూ.18 కోట్లు మంజూరు చేస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలుస్తుంది.



వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్


మారనున్న కొడంగల్ రూపు రేఖలు



కొడంగల్‌ను అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించడం హర్షణీయం. గతంలో ఎన్నడూ లేని విధంగా కొడంగల్ ప్రాంత అభివృద్ధితో ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మంజూరైన పనులను సీఎం త్వరలోనే ప్రారంభించనున్నారు.

తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్

మెడికల్ కళాశాల ఏర్పాటు హర్షణీయం



వెనకబడిన కొడంగల్ ప్రాంతంలో మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు అభివృద్ధి పనులు మంజూరు చేయడం హర్షణీయం. అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. అభివృద్ధి పనులకు ఈ ప్రాంత ప్రజలు సహకరించాలి.

ఎన్.ప్రశాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కొడంగల్

అభివృద్ధిని స్వాగతిస్తున్నాం




కొడంగల్ ప్రాంత అభివృద్ధిని స్వాగతిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి సారించడం సంతోషదాయకం. వెనకబడిపోయిన కొడంగల్ ప్రాంతానికి ప్రస్తుతం నిధులు మంజూరు చేశారు. మెడికల్ కళాశాలతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనుండడం అభినందనీయం.

వేణుగోపాల్, ఉపాధ్యాయుడు, కొడంగల్

ఉన్నతాధికారుల స్థల పరిశీలన

కొడంగల్ ప్రాంతానికి మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి భవన నిర్మాణాలు తదితర వాటి కోసం కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్నతాధికారులతో స్థల సేకరణ చేపడుతున్నారు. మెడికల్ కళాశాల కోసం కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులో సర్వే నెంబరు 19లో స్థల పరిశీలనతో పాటు సంబంధిత రైతులతో మాట్లాడి ఇంటికో ఉద్యోగం, పరిహారం అందిస్తామని తెలిపారు. కొడంగల్ పట్టణ శివారులోని బుల్కాపూర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం, సిద్ధవంపు సమీపంలోని ప్రభుత్వ స్థలాలను ఫారెస్టు, రెవెన్యూ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టారు. దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్‌లో ప్రభుత్వ భూమిని, బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లి శివారులోని ప్రభుత్వ భూముల పరిశీలనతో పాటు సర్వేలు చేపట్టి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రస్తుతం కొడంగల్ ప్రాంతానికి మంజూరైన మెడికల్, నర్సింగ్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్మాణానికి స్థలాల సేకరణలో నిమగ్నమయ్యారు.









2025 నాటికి మేడ్చల్-కాళ్లకల్
జాతీయ రహదారి పనులు పూర్తి



మేడ్చల్‌లో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలిస్తున్న జాతీయ రహదారి ప్రాజెక్ట్ మేనేజర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి17: 2025 చివరి నాటికి మేడ్చల్-కాళ్లకల్ జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలని జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మేడ్చల్‌లో నిర్మిస్తున్న వంతెన పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి నుంచి కాళ్లకల్ వరకు రూ.530కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. మేడ్చల్ క్లాసిక్ దాబా వద్ద అతిపెద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల్లో 75పిల్లర్లు, 5 అండర్ పాస్‌లు, ఆరులేన్ల రోడ్డు వెడల్పు 30మీటర్లు ఉంటుందని వివరించారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లు, చెట్ల తొలగింపునకు అనుమతులు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఇంకా 17.7శాతం పనులు జరగాల్సి ఉందన్నారు. అత్వెల్లి-కరీంనగర్ లింక్ రోడ్డు చెరువు తూము వద్ద అండర్‌పాస్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మేడ్చల్ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం 10 నుంచి 20శాతం ట్రాఫిక్ పెరుగుతోందని, 60ఏళ్ల క్రితం ఈ జాతీయ రహదారి నిర్మించారన్నారు. భవిష్యత్తులో సమీప గ్రామాల ప్రజలు హైవే పైకి ఎక్కకుండా సర్వీసు రోడ్డును ఉపయోగించుకోవాలని సూచించారు.

అంబులెన్స్‌ల రాకపోకలకు సహకరించండి : రాఘవేందర్‌రావు

అంబులెన్స్‌ల రాకపోకలకు ప్రజలు సహకరించాలని ప్రాజెక్ట్ మేనేజర్ రాఘవేందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రజావసరాలకు అనుగుణంగా కొన్నిచోట్ల యూ టర్నులను ఏర్పాటు చేశామని, హైవే విస్తరణ పనులు జరుగుతున్నందున తక్కువ వేగంతో వాహనాలు నడపాలని ఆయన తెలిపారు.


బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


యాలాల, ఫిబ్రవరి 17 : విద్యార్థులు మంచిగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మంగమ్మ అన్నారు. శనివారం పాఠశాలలో 9వ తరగతి, ఇంటర్ ఫస్ట్‌ఇయర్ విద్యార్థినులు టెన్త్, సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో స్పెషలాఫీసర్ మంగమ్మ మాట్లాడుతూ బాగా చదువుకొని తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో యాలాల కేజీబీవీ ఉపాధ్యాయినులు











రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్.. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్థాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ ఛైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

హరీ‌ష్‌రావు చెప్పేవన్నీ అబద్ధాలే

● మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 17 : అసెంబ్లీలో మాజీ మంత్రి హరీ‌ష్‌రావు చెప్పేవన్నీ అబద్ధాలేనని, మాటలు వింటుంటే ఒల్లు జలదరిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తి ప్రజాధనాన్ని వృథా చేశారు కానీ బీడు భూములకు నీటిని అందించలేదని ఆయన విమర్శించారు. భువనగిరి శనివారం పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టును మరింత దిగువన కట్టి ఎత్తిపోతల పేరుతో ప్రజా ధనాన్ని వథా చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఒక్క మెదక్ జిల్లాకు తప్ప రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

వికారాబాద్, ఫిబ్రవరి 17 : ట్రాన్స్‌జెండర్లు 2019 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులను పొందాలని జిల్లా ముఖ్య న్యాయ సహాయాధికారి వెంకటేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ పి రాము అన్నారు. శనివారం వికారాబాద్ మండల సమైక్య కార్యాలయంలో మహిళ, శిశు, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారితశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డుల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి వివక్ష కలిగినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళా సాధికారత కేంద్రం ట్రాన్స్‌జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మీ, బాబు, ట్రాన్స్‌జెండర్ అధ్యక్షురాలు రమ్యశ్రీ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం



ఆరోగ్య ఉపకేంద్రంలో ఢిల్లీ బృందం

కులకచర్ల, ఫిబ్రవరి 17 : చౌడాపూర్ మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఢిల్లీ బృందం సభ్యులు డాక్టర్ శ్రీరామ్‌మొహంతీ, డాక్టర్ సువర్ణ అబ్జె సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జీవరాజ్, కులకచర్ల వైద్యాధికారి వాజిపుద్దీన్, డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం పెట్టడం సరికాదు

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 17 : వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టడం సరికాదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె బీఆర్ఎస్ పార్టీ ఇమేజ్‌తో గెలవలేదనే విషయాన్ని ఆ పార్టీ నేతలు గ్రహించాలని, పదవీ కాలాన్ని పూర్తిచేసుకుంటారని చెప్పారు.

గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 17 : బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. చేవెళ్లప్రాణహిత ప్రాజెక్టును అప్పటి సీఎం వైఎస్ఆర్ పరిగి వరకు పొడిగించేందుకు కృషి చేశారని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరు వచ్చే విధంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా అప్పటి సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాకు సాగునీరు రాకుండా చేశారని విమర్శించారు. సాగునీరు కోసం తాను పాదయాత్ర చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వికారాబాద్‌కు వచ్చిన అప్పటి మంత్రి హరీశ్వరావు ఎందుకు పాదయాత్ర చేస్తావు..? ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పారని రామ్మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. అడ్వాన్స్‌ల పేరిట నిధుల వాడుకుంటున్నట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని రామ్మోహన్‌రెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావుకు సవాల్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీఎంను కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 : అవిశ్వాసం సమయంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కప్పరి స్రవంతికి మద్దతుగా నిలిచిన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 24వ వార్డు కౌన్సిలర్ జెర్కొని బాల్‌రాజ్, 10వ వార్డు కౌన్సిలర్ పి.శంకరయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శంకరయ్య కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆరు నెలల క్రితం బీఆర్ఎస్‌లో చేరగా.. తిరిగి ఈరోజు సొంత గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోనే అన్ని వర్గాలకు సముచిత గౌరవం లభిస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకు పోతున్నందునే తాము పార్టీలో చేరామని బాల్‌రాజ్, శంకరయ్య తెలిపారు. వీరి వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్రవంతి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, బర్ల జగదీశ్వర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు

● అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మొబైల్ టీంలు

● బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్



తహసీల్దార్

బషీరాబాద్, ఫిబ్రవరి 17 : అభివృద్ధి పనుల పేరిట ఎవరైనా అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడితే ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు పెడతామని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో 'కాగ్నానదిలో ఇసుకను కొల్లగొడుతున్న అక్రమార్కులు' అని శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో మొబైల్ టీం ఏర్పాటు చేసి ఇసుక రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నవాంద్గీ శివారులో ఇసుక రీచ్ నుంచి ప్రభుత్వ పనులకు ఇసుక రవాణాకు అనుమతులిస్తున్నమన్నారు. ఇంకెక్కడి నుంచైనా అనుమతి లేకుండా ఇసుకను తరలించే ప్రయత్నం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత కూడా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరలించే అనుమతి ఉందని చెప్పారు. దానిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇందర్‌చెడ్, గంగ్వార్, జీవన్గి వద్ద కూడా ప్రత్యేక దృష్టి పెట్టి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని వెల్లడించారు.

మహేశ్వరంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

● త్వరలో కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే తీగల?

● రంగారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 17 : మహేశ్వరం నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు రోజురోజుకూ ఎవరు ఊహించని రీతిలో మారుతున్నాయి. నియోజకవర్గంలోని మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల్లోని పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే కాంగ్రెస్‌లో తీర్థం పుచ్చుకోగా.. తుక్కుగూడ మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్లు కూడా ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మహేశ్వరం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాటు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదే విధంగా మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జిల్లా ప్రస్తుత ఛైర్ పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి లు తమ అనుచరులతో త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని ప్రచారం సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే తీగల స్వగ్రామమైన మీర్‌పేటలోని టికేఆర్ కళాశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచనలో తీగల కుటుంబం యోచిస్తోంది. వారితో పాటు నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులుకూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్న పలు సర్వేల ఆధారంగా బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌వైపు వెళ్లేలా చేస్తుందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

● అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● 30 తులాల బంగారం, కేజీ వెండి, మూడు బైక్‌లు స్వాధీనం : ఎస్పీ కోటిరెడ్డి



ఆభరణాలను చూపిస్తున్న ఎస్పీ

వికారాబాద్, ఫిబ్రవరి 17 : తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను వికారాబాద్ పోలీసులు అరెస్టు చేసి బంగారం, వెండి, నగదు, బైకులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మూడు బైకులు, 30.3 తులాల బంగారు, 1.40 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శనివారం సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కరక్కాయల గూడెం గ్రామానికి చెందిన సన్నిది ఆంజనేయులు మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగించేవాడని, సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న ఆంజనేయులు కొంత కాలంగా తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. ఈ నెల 7న నవాబ్‌పేట్ మండలం వట్టిమీనేపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో 60 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు దొంగలించి, వాటిని వికారాబాద్‌లో అమ్మడానికి వస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడని, పోలీసులకు అనుమానం వచ్చి ఆంజనేయులును విచారించి అతనిపై గతంలో 36 కేసులు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. గత డిసెంబర్ 11న వికారాబాద్ పట్టణంలోని అస్సాం బేకరీ దగ్గరలో ఓ ఇల్లు తాళం వేసి ఉండటాన్ని గమనించి తాళాన్ని పగులగొట్టి బంగారం, ఆభరణాలు దొంగలించాడని తెలిపారు. వీటితో పాటు వికారాబాద్ లో ఒక కేసు, కోదాడలో నాలుగు కేసులు ఉన్నట్లు గుర్తించి తాజాగా ఆరు కేసుల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడానికి కృషిచేసి పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. డీఎస్పీ అంజయ్య, సీసీఎస్ సీఐ బల్వంతయ్య, మోమిన్ పేట సీఐ ఆంజనేయులు, నవాబుపేట సీఐ శ్రీను ఎస్సై భరత్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరతతో నిలిచిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు

తాండూరు, ఫిబ్రవరి 17 : తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక పర్మిట్ల బుక్కుల కొరత కారణంగా నాలుగు రోజులుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు నిలిచిపోయాయి. మండలంలో ఖాంజాపూర్ రీచ్‌ను ఇసుక తరలించేందుకు పాయింట్‌గా గుర్తించారు. పర్మిట్ బుక్కులను డీఆర్డీఏ కార్యాలయం నుంచి తెప్పించుకోవాలి. అవసరాన్ని బట్టి రెవెన్యూ అధికారులు నామ మాత్రం బుక్కులు తెప్పించి మూడు రోజుల పాటు పర్మిట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి తాండూరుకు రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మార్చి 15లోపు ఈ పనులు చేపడితే బిల్లులు వస్తాయి. ఆర్థిక సంవత్సరం ముగిస్తే నిధులు రావడానికి మరో ఏడాది పడుతుంది. పార్లమెంట్ ఎన్నిలక కోడ్ వస్తే పనులను ఆపాల్సి వస్తుంది. పనులను త్వరగా చేయించాలనే తపన అధికారులలో లేదని, పర్మిట్లు లేకుండా ఇసుక తరలిస్తే పోలీసులు కేసులు పెడుతారని పలువురు వపోతున్నారు. కరీంనగర్, నిజామాబాద్ నుంచి వచ్చే ఇసుక కూడ వివిధ కారణాలతో తాండూరుకు రావడం లేదు. ఇదిలా ఉండగా పర్మిట్ బుక్కుల కొరత ఉందనే విషయాన్ని సిబ్బంది తన దృష్టికి తీసుకు రాలేదని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు చెప్పారు.

అక్రమ నిర్మాణంపై విచారణ

తాండూరురూరల్, ఫిబ్రవరి 17 : మండలంలోని అంతారంలో చేపట్టిన ఓ అనుమతి లేని నిర్మాణంపై డీఎల్పీవో శంకర్‌నాయక్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఎత్తరి కృష్ణయ్య గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్‌పై తన ఇంటి మెట్లు నిర్మించి, పైప్‌లైన్ పక్కనే మరుగుదొడ్డి కోసం రింగులు వేయడంతో గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్పీవో శనివారం అంతారం గ్రామంలో విచారణ జరిపారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఈ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్‌ను ప్రశ్నించారు. మరుగుదొడ్డిపై నిర్మాణంతో పాటు, ఇతర వివరాలు సేకరించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీరుల త్యాగాలతోనే మనకు విముక్తి

● మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న విద్యాసాగర్ రావు

వికారాబాద్, ఫిబ్రవరి 17 : వీరుల త్యాగాలతోనే మనకు విముక్తి కలిగిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం స్థానిక సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో హారతి ద్వారకానాథ్ రచించిన హైదరాబాద్ సంస్థాన విమోచనానికి, ప్రాంతీయ బోధనకు పునాదులు వేసిన తెలంగాణ దార్శనికులు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. గతంలో ఎంతో మంది హైదరాబాద్ విమోచనకు సంబంధించిన పుస్తకాలు రాసినా.. ఇది వాటికి భిన్నమైనదని హౌసింగ్ బోర్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. నిజాం పాలకులు ప్రాంతీయ భాషను ప్రోత్సహించలేదని, విద్యారంగంలో ఉర్దూకు పెద్ద పీట వేశారని పుస్తక రచయిత ద్వారకనాథ్ చెప్పారు. అనంతరం ద్వారకానాథ్‌ను సన్మానించారు.

మధ్యాహ్న భోజనానికి ముక్కిన బియ్యం

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 17 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం సరఫరా చేస్తున్న బియ్యం నెలల తరబడి నిల్వ ఉండటంతో ముక్కి పోతున్న సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం విద్యాల ఉన్నత పాఠశాలలో జరిగింది. శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం ఉండటంతో తల్లిదండ్రులు హాజరై పాఠశాలలోని బియ్యాన్ని పరిశీలించారు. అవి ముక్కి పోవడంతో ఉపాధ్యాయులను ప్రశ్నించారు. తమ పాఠశాలలో బియ్యం స్టాక్ లేకపోవడంతో రాయికల్ పాఠశాల నుంచి తీసుకువచ్చామని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ బదులిచ్చారు. ఆ బియ్యం ఉండలు కట్టాయని చెప్పారు.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి
కేసీఆర్ జన్మదిన వేడుకలు



వికారాబాద్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పాల్గొన్న నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 17: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల వద్ద కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో కేక్ కట్ చేశారు. సబితా ఆనంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐనాపూర్‌లో వైద్య శిబిరం, సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ముత్యంరెడ్డి, కౌన్సిలర్లు నవీన్, సురేష్, గోపాల్, రామస్వామి పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, కె.శ్రీనివాస్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో, రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు టి.శ్రీధర్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌గౌడ్, నాగేష్‌గౌడ్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, సాయినాథ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాస్, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: కేసీఆర్ జన్మది వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మోమిన్‌పపేట్‌లోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు దబ్బాని వెంకట్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సాధించిన కారణ జన్ముడు కేసీఆర్ అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో, అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, నాయకులు ప్రభాకర్, తిరుపతిరెడ్డి, మహబూబ్ అలీ, శివ, చంద్రకాంత్, కృష్ణ, అనూప్‌రెడ్డి, శోభన్, మల్లేశం, ప్రభు పాల్గొన్నారు.

పరిగి: కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలోని తన నివాసంలో కేక్ కట్‌చేసి కేసీఆర్ జన్మదిన వేడుకల జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. ప్రజల మదిని దోచిన నేత కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, బి.నాగేశ్వర్‌రావు, టి.వెంకటేశ్, నాయకులు బి.రవికుమార్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో నిర్వహించారు. పోచారం పరిధి సంస్కృతి టౌన్‌షిప్‌లో కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు, 108 సిబ్బందిని సత్కరించి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోనూ బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, పోచారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రెడ్డియానాయక్, బర్ల హరిశంకర్, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, రమాదేవి, అనురాధ, జహంగీర్, వెంకట్‌రెడ్డి, మురళి, శరత్ పాల్గొన్నారు.



నాగారంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

పెద్దేముల్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను మంబాపూర్‌లో నిర్వహించారు. మాజీ సర్పంచ్ రేగొండి శ్రవణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముజీబ్, మారెపల్లితండా మాజీ సర్పంచ్ పాండునాయక్, ఇబ్రహీం, నాగేందర్, అనంతయ్య, మారుతి, గోపాల్‌రెడ్డి, రత్నయ్య, బాలప్ప, యేసు, సజాద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: కేసీఆర్ 70వ పుట్టిన రోజును పురస్కరించుకొని వెంకటాపూర్‌లో 70కిలోల కేక్‌ను కట్ చేశారు.కందుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శివశంకర్, వేణుగోపాల్, బాల్‌రాజ్, బిక్షపతిగౌడ్, శ్రీనివాస్, బి.వెంకటేష్, లింగం, జంగయ్య, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.



సంస్కృతి టౌన్‌షిప్‌లో మొక్క నాటుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ హరిప్రసాదరావు

సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం కావాలి



సేవాలాల్ జయంతి వేడుకల్లో గిరిజన వేషధారణలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి, ఫిబ్రవరి 17: సేవాలాల్ మహరాజ్ గిరిజన జాతి రత్నమని, ఆయన జీవితం అందరికీ ఆదర్శం కావాలని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో డివిజన్ స్థాయి సేవాలాల్ జయంతిని గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజీ నుంచి బాహర్‌పేట్, ఎస్‌గార్డెన్ వరకు గిరిజనులు ఆట, పాటలతో ఊరేగింపు నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటాలకు పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్న తండాలకు బీటీ రోడ్లు వేస్తామని, కొత్త పంచాయతీలకు భవనాలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర,మాజీ ఎంపీపీ శాంతిబాయి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌రెడ్డి, ఎంఈవో హరిశ్చందర్, పార్టీల నాయకులు కె.అనిల్‌రెడ్డి, తావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

పూడూరు, ఫిబ్రవరి 17 : ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం చెంచుపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన గ్రామాలకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని చేవెళ్ల ఎంపీ అభ్యర్థినిగా నిలిపేందుకు అధిష్ఠానం ఆలోచిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా గెలుపునకు మనం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పెంటయ్య, అజీమ్, శ్రీనివాస్, వీరేష్, రాములు, బాలమణి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి17: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని మేడ్చల్ విద్యుత్ ఏఈ శశిధర్ అన్నారు. రాఘవేందర్‌నగర్ కాలనీలో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏఈ శశిధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

శామీర్‌పేట, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈఓ వసంతకుమారి పిలుపునిచ్చారు. శనివారం తూంకుంట ప్రాథమిక పాఠశాలలో సిమర్ ఫౌండేషన్ ప్రతినిధి హర్‌జిత్‌సింగ్, అమర్ ట్రావెల్స్(ఇండియా) సౌజన్యంతో విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ, టీచర్లు నిర్మల, అరుణ, వాణి, మంజుల, సుశీల పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సుదర్శన్‌రెడ్డి సేవలు మరువలేనివి

తాండూరురూరల్, ఫిబ్రవరి 17: తాండూరు ఎంపీడీవోగా సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ స్వరూపవెంకట్‌రాంరెడ్డి, ఎల్మకన్నె ప్యాక్స్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం బదిలీపై వెళ్లిన సుదర్శన్‌రెడ్డిని, కొత్తగా బాధ్యతలు చేపట్టిన విశ్వప్రసాద్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీవోగా సుదర్శన్‌రెడ్డి హరితహారం, పంచాయతీలకు ట్రాక్టర్ల కొనుగోలు, పారిశుధ్యం వంటి పనులను చేయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రతన్‌సింగ్, డీటీ విజయేందర్, పంచాయతీ రాజ్ ఏఈ నందిని, ఉద్యానవన అధికారి మల్లికార్జున్, ఆర్ఐలు రాజారెడ్డి, బాల్‌రాజ్, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, శాంతు, మాజీ సర్పంచ్‌లు రాజప్పగౌడ్, రాములు, నరేందర్‌రెడ్డి, నాగప్ప, పద్మమ్మ, చంద్రప్ప, సాయిలు, నాయకులు రాంలింగారెడ్డి, శేఖర్‌రెడ్డి, సంగప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

కులగణన తీర్మానం చరిత్రాత్మకం



కొడంగల్: మాట్లాడుతున్న బీసీ సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటయ్య

కొడంగల్/కీసర/పరిగి/ఘట్‌కేసర్, ఫిబ్రవరి 17:రాష్ట్రంలో బీసీ కులాల గణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించడం చరిత్రాత్మక ఘట్టం అని బీసీ సంఘం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్, గౌరవాధ్యక్షుడు బి.వెంకటయ్య, నాయకులు కేశవులు, వెంకటేశ్వర్లు, భీమ్‌రాజ్, ఓంప్రకాశ్ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా బీసీ వర్గాలకు సరైన న్యాయం జరగడం లేదని, ఇందుకు బీసీ కులగణన చేపట్టాలని తాము పోరాటం చేస్తున్నామన్నారు. బీసీలు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనకబడ్డారని, కులగణనతో న్యాయం జరిగే అవకాశముంటుందన్నారు. కీసరలో కాంగ్రెస్ శ్రేణులు జ్యోతి బాపూలే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కుల గణన చేపట్టడం హర్షణీయం అని పార్టీ మండల అధ్యక్షుడు కోల కృష్ణ అన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి, నా యకులు రవీందర్, వెంకటేష్, లక్ష్మణ్, దయానంద్‌గౌడ్, స్వప్నరెడ్డి, అభిలాష్ పాల్గొన్నారు. కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక ని ర్ణయం తీసుకుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. పరిగిలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు పా లాభిషేకం చేశారు. కులగణనను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం దిశగా పనిచేస్తోందన్నారు. డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్, డీసీసీ ఉపాధ్యక్షుడు, ఓయూ జేఏ సీ కన్వీనర్ రాచంద్రయ్య, ఎ.ఆంజనేయులు, పి.చిన్ననర్సింహులు, కె.యాదయ్య, వెంకటేశ్, రహీం, నర్సింహులు, రాములు పాల్గొన్నారు. కులగణనకు శాసనసభలో తీర్మానం చేయడం గొప్ప పరిమాణం అని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చేలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందుకు కుల గణన ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, అనిత, కౌన్సిలర్ మల్లేష్, నాయకులు ఆంజనేయులు, వెంకటేష్, దేవేందర్, నాగరాజు, వాజిద్, శ్రీనివాస్, ఎస్.మల్లేష్, బద్రి, సత్యం, గోపాల్ పాల్గొన్నారు.



కీసరలో పూలే చిత్రపటానికి క్షీరాభిషేకం



ఘట్‌కేసర్: రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



పరిగిలో రేవంత్‌రెడ్డి, కృష్ణయ్యల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఆధ్యాత్మిక మార్గంతో సుఖమయ జీవితం

బషీరాబాద్, జనవరి 28: ఆధ్యాత్మిక మార్గంతో జీవితం సుఖమయం అవుతుందని వీరతపస్వి మునీంద్ర శివాచార్యస్వామి హల్‌కట్టి అన్నారు. శివ భక్తులు మాలధారణతో సన్మార్గంలో నడిస్తే భగవంతుడి మోక్షం లభిస్తుందని సూచించారు.నవాంద్గీ సంఘమేశ్వరాలయంలో జరిగిన అర్ధ మండలి శివదీక్షామాలధారణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో 150 మంది భక్తులు శివమాలధారణ స్వీకరించారు.అంతకు ముందు ప్రధాన పూజారి మహంతయ్యస్వామి నేతృత్వంలో శివభక్తులు, స్థానికులు పూజలు చేశారు. శివభక్తులకు ఇందర్‌చెడ్ వెంకట్‌రెడ్డి ప్రసాదవితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్ మహరాజ్, మాజీ సర్పంచ్ పి.వీరామణిమాధవరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శశిరేఖగోపాల్, నాయకులు గాండ్ల వీరణ్ణ, శ్రావన్‌కుమార్, శివదీక్ష బృందం సభ్యులు రవీందర్‌రెడ్డి, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదువుకుంటే భవిష్యత్తు

వికారాబాద్, ఫిబ్రవరి 17: ఏకాగ్రతతో చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని మునిసిపల్ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని కొత్తగడి సమీకృత బాలికల వసతి గృహంలో ఆల్ ఇన్ వన్(గైడ్స్) అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో బాలికలు కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాల సంబంధించి ఎలాంటి విషయమైనా స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, యాదగిరి, జంగయ్య, రాజు, శేఖర్, ప్రవీణ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు గైడ్‌లు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

నాపరాతి పరిశ్రమను ఆదుకోవాలి

తాండూరు, ఫిబ్రవరి17 : నష్టాల్లో ఉన్న నాపరాయి పరిశ్రమ మనుగడకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవచూపాలని క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు ఓంప్రకాశ్, ప్రధాన కార్యదర్శి లాల డిమాండ్ చేశారు. శనివారం స్టోన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 25వేల మందికి ఉపాధి కల్పిస్తున్న నాపరాయి పరిశ్రమ సంక్షోభంలో ఉందన్నారు. కర్ణాటకలో రాయల్టీ రూ.800ఉంటే ఇక్కడ రూ.2,800 ఉందని తెలిపారు. నాపరాయి పరిశ్రమ పక్క రాష్ట్రానికి తరలిపోయే ప్రమాదం ఉందన్నారు. సీఎం, స్పీకర్ సొంత జిల్లాపై దృష్టి సారించాలన్నారు. అసెంబ్లీలో తాండూరు ఎమ్మెల్యే నాపరాయి పరిశ్రమపై మాట్లాడటం శుభపరిణామన్నారు. క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు తలారి నర్సిములు, సయ్యద్ హబీబ్ లాలా ఉన్నారు.

'అసెంబ్లీలో సమస్యలపై ప్రస్తావించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు'

పెద్దేముల్, ఫిబ్రవరి 17 : సుద్ద వ్యాపారుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పుల్లర్స్ ఎర్త్‌మైన్స్ అండ్ మ్యాన్యుఫాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తాండూరు పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. సుద్ద ఖనిజాన్ని వెలికతీయడానికి అనుమతులు పొందాలంటే అనేక కష్టాలు ఎదురవుతున్నాయని, పొరుగు రాష్ట్రం కర్ణాటకలో సుద్ద తవ్వకాలకు రుసుములు లేకుండానే అనుమతులు ఇస్తున్నారని చెప్పారు. తెలంగాణలో లీజు కోసం డబ్బు కట్టి దరఖాస్తు చేసుకుని యేండ్లు గడుస్తున్నా అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఆయన అసెంబ్లీలో ప్రస్తావించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కూడా మన జిల్లాకు చెందిన వారే కావడం వల్ల తమ సమస్యలపై సత్వరమే స్పందించాలని వారు కోరారు.

ఎస్సీ సెల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాబు

శామీర్‌పేట, ఫిబ్రవరి 17: మండల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాడెం బాబును నియమించారు. శనివారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుదర్శన్.. అలియాబాద్‌కు చెందిన తాడెంబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సుదర్శన్ తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డికి, పార్టీ నాయకులకు ఈ సందర్భంగా బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న తాడెం బాబు

సంక్షిప్తంగా...

వికారాబాద్ : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిని గద్దె దించడం మీ తరం కాదని జడ్పీటీసీ మాజీ ముత్తాహర్ షరీఫ్ పేర్కొన్నారు. సునీతారెడ్డిని చైర్ పర్సన్ చేయాలనే ప్రజలు ఆమెను గెలిపించారన్నారు. ఇప్పుడు విమర్శిస్తున్న వారంతా సొంత ఇమేజ్‌తో గెలవలేదనే విషయాన్ని గ్రహించాలన్నారు. వీరికి ప్రజలు బుద్ధి చెప్పినా వైఖరి మారడం లేదని, జిల్లా అభివృద్ధి మాజీ ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

● **కొడంగల్ రూరల్:** దొడ్డి కొమరయ్య ఆత్మగౌరవ కురుమ భవనాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో ప్రారంభోత్సవం ఉందని నర్సాపూర్ గ్రామానికి చెందిన కురుమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.నాగప్ప పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక సీఎంలు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నట్లు తెలిపారు. కురుమ సంఘం సోదరులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

● **శామీర్‌పేట:** చట్ట ప్రకారం కొనుగోలు చేసిన వ్యవసాయ పట్టా భూమికి రెవెన్యూ రికార్డులను సరి చేసి తమకు న్యాయం చేయాలని రైతులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రైతులు కొక్కండ లక్ష్మీపతి, బాల్‌రెడ్డి, వెంకటేశం, అల్లాడి నాగేశ్, క్రిష్ణమూర్తి తదితరులు రెవెన్యూ కార్యాలయం వారి భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను, పాసుబుక్కులను చూపారు.

తాండూరు రూరల్: జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఉమ్మడి జిల్లా ప్రజల విశ్వాసం పొందిన నాయకురాలు అని తాండూరు కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, బషీరాబాద్ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బషీరాబాద్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడారు. సునీతారెడ్డిపై అవిశ్వాసం పెట్టే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని చెప్పారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కుటుంబం బీఆర్ఎస్ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరారని, ప్రమోదినిరెడ్డి ఏ పార్టీ నుంచి గెలిచారు? ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. సునీతారెడ్డి సమర్థంగా అవిశ్వాసాన్ని ఎదుర్కుంటారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్డె హన్మంతు, గిరిజన నాయకులు బన్సీలాల్ ఉన్నారు.

● **ఘట్‌కేసర్:** ట్రేడ్ లైసెన్స్ లేని మద్యం దుకాణాన్ని పోచారం మున్సిపల్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఎస్‌వీడీ మద్యం దుకాణం నిర్వాహకులు మున్సిపాలిటీ లైసెన్స్ తీసుకోలేదు. మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్ లేని ఎస్‌వీడీ మద్యం దుకాణంతో పాటు మరోరెండు దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా దుకాణదారులంతా మున్సిపాలిటీ నుండి ట్రేడ్ లైసెన్లను తీసుకోవాలని లేని యెడల చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● **తాండూరు:** రాజరాజేశ్వరి బస్సు యాత్రలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 20న తాండూరు నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్రను ఇందిరాచౌక్‌లో భారీ బహిరంగ సభ ద్వారా ప్రారంభిస్తారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జుం టుపల్లి వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు యాత్రను కేంద్ర మంత్రి జ్యోతిర్యాదిత్య సింధియా ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని కోరారు.

● **ధారూరు:** 20న తాండూరు నుంచి ధారూరుకు రానున్న బీజేపీ విజయసంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ నాయకులు సమావేశమై బస్సుయాత్రపై చర్చించారు. తాండూరు నుంచి బయలుదేరే ఈ బస్సుయాత్ర ధారూరు మీదుగా వికారాబాద్‌కు వెళుతుందని వారు వివరించారు. ధారూరులో రోడ్డుషో, కార్నర్ మీటింగ్ నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కసిరెడ్డి బాస్కర్ రెడ్డి, విజయబాస్కర్ రెడ్డి, వివేకనందా రెడ్డి, విజయ రాజు, రాజేందర్ గౌడ్, రమేశ్, రాఘవేందర్ గౌడ్, సాయిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్ :** జినుగుర్తి-సంకిరెడ్డిపల్లి రోడ్డు మార్గంలో నాటిన మొక్కలకు శనివారం నిప్పంటుకుని కాలిపోయాయి. మొక్కల మధ్య గడ్డిపెరిగి ఎండిపోయింది. గడ్డికి నిప్పంటుకోవడంతో మొక్కలు కూడా కాలిపోయాయి. అధికారులు జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

'పీఎం కిసాన్'కు ఈ-కేవైసీ చేసుకోవాలి

పూడూరు, ఫిబ్రవరి 17: పట్టాదారు పాసుపుస్తకం ఉండి, పీఎం కిసాన్ డబ్బులు వస్తున్న రైతులు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శనివారం ఏఈవోలతో సమీక్ష సమావేశం ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో 453మంది రైతుల ఈ-కేవైసీ, 190 మంది ఆధార్ సీడింగ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ రైతులు తమ గ్రామ ఏఈవోలకు ఆధార్ అనుసంధాన మొబైల్ నంబర్ ఓటీపీతో ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా కేవైసీ పూర్తి చేయాలని ఏఈవోలను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాంబాబు, గీత, ఇలియాస్, శిరీష, వర్ష పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో శివ స్వాముల పడిపూజ

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 17 : మండలంలోని హస్నాబాద్ గ్రామంలో శనివారం ముదిగండ్ల కృష్ణ నివాసంలో శివ స్వాములు పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో హస్నాబాద్, పరిసర గ్రామాల శివస్వాములు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయం వద్ద టెంకాయల దుకాణానికి వేలం



టెంకాయల విక్రయానికి వేలంలో పాల్గొన్న స్థానికులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 17: మినీ మేడారంగా పిలవబడే మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో శనివారం టెంకాయల దుకాణానికి వేలం నిర్వహిచారు. ఏడాది పాటు కొబ్బరికాయలు విక్రయానికి వేలం నిర్వహించగా కోస్గి మండలం మీర్జాపూర్‌కు చెందిన నర్సిములు రూ.9,91,000కు దక్కించుకున్నాడు. గతేడాది కంటే వెయ్యి అధికంగా వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కాగా రానున్న బ్రహ్మోత్సవాలకు టెంకాయల దుకాణం వేలాన్ని బుధవారానికి వాయిదా వేశారు.

'ధ్యానంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది'

ధారూరు, ఫిబ్రవరి 17: ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని పిరమిడ్ స్పిరుచ్వల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ప్రచార కార్యదర్శి నవీన్ తెలిపారు. మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్దు, అంతారం, నాగారం, మైలారం పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ధ్యానం చేస్తే రోగ నిరోధక శక్తిపెరిగి వ్యాధులు రావన్నారు. ధ్యానం ప్రతీ మనిషికి దివ్య ఔషధం వంటిదని, నిత్యం ధ్యానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణరెడ్డి, శైలజ, శోభిత, శ్రీనివాస్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పార్టీలు మారే నాయకులను నమ్మొద్దు'

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 17: పార్టీలు మారే నాయకులను ప్రజలు నమ్మొద్దని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో ఉన్న మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కుటుంబీకులు స్వలాభం కోసం కాంగ్రెస్ చేరడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని కొడంగల్‌లో నరేందర్‌రెడ్డి ఓటమికి కారణమయ్యారన్నారు. కాంగ్రెస్ నాయకులు తమకు పదవులు దక్కుతాయనే కొత్త వారిని చేర్చుకోవడంతో అయోమయానికి గురవుతున్నారన్నారు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కీసర, ఫిబ్రవరి17: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మధు అన్నారు. శనివారం మండల పరిధి చీర్యాల్ పాఠశాలలో సైబర్ నేరాలపై ఎస్ఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు అధికమయ్యాయని తెలిపారు. ప్రతీ ఇంట్లో, ప్రతీ ఒక్కరి వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నాయని, ఈ ఫోన్‌ల వల్లనే సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని ఎస్సై అన్నారు. సోషల్ మీడియ ద్వారా వస్తున్న నేరాలు, జరిగే పరిస్థితులు నుంచి ఎలా రక్షణ పొందాలో ఎస్ వివరించారు. తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్లు ఇవ్వకూడదని, ఫోన్ ద్వారా సాకేంతిక పరిజ్ఞానాని పెంచుకోవాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కులకచర్ల ఎస్సై అన్వేష్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 17: కులకచర్ల ఎస్సైగా అన్వేష్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వికారాబాద్ పీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని నూతన ఎస్సై తెలిపారు.

దోమ ఎస్సైగా ఆనంద్‌కుమార్

దోమ, ఫిబ్రవరి 17: దోమ నూతన ఎస్సైగా ఆనంద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బంట్వారంలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

క్రైం కార్నర్

కలప ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన కలప ట్రాక్టర్

తాండూరురూరల్, ఫిబ్రవరి 17 : అనుమతి లేకుండా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు కరన్‌కోట్ పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి వెంకట్‌రెడ్డి చంద్రవంచ నుంచి తాండూరుకు ట్రాక్టర్(ఏపీ29 టీబీ2864)లో వేప కలప తరలిస్తున్నాడు. గౌతాపూర్ వద్ద పోలీసులు ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు చూపించాలని వెంకట్‌రెడ్డిని అడుగగా లేవన్నాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి కలప ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

కులకచర్ల, ఫిబ్రవరి 17: భూ వివాదంలో ఇరువర్గాలు పరస్పర దాడులకు దిగిన సంఘటన చౌడాపూర్ మండలం హర్యానాయక్ తండాలో శనివారం జరిగింది. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కేతావత్ రమేశ్ తన పొలంలో కుటుంబ సభ్యులతో కలిసి హద్దురాళ్లు పాతుతుండగా బాణావత్ రమేశ్ కుటుంబీకులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాలు పరస్పర దాడి చేసుకున్నాయి. కె.రమేశ్ ఫిర్యాదు మేరకు బి.రమేశ్, పాండు, చందర్, 9మందిపై కేసు నమోదుచేశామన్నారు. బి.రమేశ్ ఫిర్యాదు మేరకు కె.రమేశ్, జెమ్లా, లాలు, రవి, సురేశ్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి పాండు, రమేశ్, జెమ్లాలను ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ప్లాట్ కబ్జా చేసిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 17: ప్లాట్‌ను కబ్జాచేసిన వ్యక్తిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అన్నోజిగూడలోని సర్వే నంబర్‌లోని ప్లాట్ 78లో 190గజాల స్థలాన్ని సంస్కృతి టౌన్‌షిప్‌కు చెందిన సురకంటి అలియాస్ పైళ్ల మమత 2019 జనవరి 31న కొన్నారు. కాగా ప్లాట్ నం:73 యజమాని బోయపల్లి సత్తిరెడ్డి తన ప్లాట్ ప్రహరీని ధ్వంసం చేపి ప్లాట్‌లోని 16గజాల స్థలాన్ని ఆక్రమించాడని మమత ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సత్తిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఐటీసీ పోలీసులు తెలిపారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించం : ఎస్పీ

పరిగి, ఫిబ్రవరి 17 : ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించబోమని, వారికి శిక్ష తప్పదని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఈ నెల 8న పూడూరు మండలం రాకంచర్లలో భూమి విషయంలో అన్నదమ్ములకు గొడవ జరగగా వారిలో ఒకరికి గాయాలయ్యాయి. దీంతో బాధితుడు 9న పోలీసుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గోపాల్ అనే వ్యక్తిపై 324, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో ఎస్ఐ ఎలాంటి చర్యలు తీసుకోవడం బాధితుడు ఎస్పీని కలిశాడు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అదే రోజు కేసు నమోదు చేశారని, బాధితుడి డాక్టర్ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత సెక్షన్‌లో మార్పు ఉంటుందని, అది వచ్చే వరకు నిర్ధారణ చేయలేం అని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఎస్సై నిర్లక్ష్యం లేదని, కాబట్టి బాధితుడు అనుమాన పడాల్సిన అవసరం లేదన్నారు. చట్టాన్ని చేతుల్లో తీసుకున్న వారిపై చర్యలు తప్పవన్నారు. ఎవరూ గొడవలు పడకుండా సామరస్యంగా మెదలాలన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యం



అక్షయ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 17: ఓ బీ-టెక్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన పోచారం పరిధిలో వెలుగులోకొచ్చింది. ఎస్ఐ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడ రాజీవ్‌గృహకల్పలో ఉండే అక్షయ్(21) వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బీ-టెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. అతడు రెండు నెలల క్రితం ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్షయ్ సెల్‌ఫోన్ తీసుకపోలేదన్నారు. ఈ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.